ప్రభాత
తెలుగు దినపత్రిక
# జయభేరి
ప్రజల పక్షాన అక్షర యజ్ఞం
jayabherinews
JAYABHERIDAILY.COM
11-11-2024
సోమవారం
మల్కాజిగిరి
సంపుటి : 02 | సంచిక : 66 | పేజీలు : 8 | వెల : 4
ఎడిటర్ మోతె రఘు తిరుపతి రెడ్డి
JB జయభేరి



నారాయణ్‌పేట్ - కొడంగల్ ప్రాజెక్టు పూర్తి చేసి త్వరలోనే మక్తల్, నాగర్‌కర్నూల్, కొడంగల్ ప్రాంతాలకు కృష్ణా జలాలను పారిస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పారు. "తెలంగాణ వచ్చి పదేళ్లవుతున్నా పాలమూరు నుంచి వలసలు కొనసాగుతూనే ఉన్నాయి. ఈ జిల్లా బిడ్డగా సాగునీటి ప్రాజెక్టులు పూర్తి చేయకపోతే నన్ను చరిత్ర క్షమించదు" అని అన్నారు.

# పాలమూరు జిల్లా వలసలకు మారుపేరు

జయభేరి, పాలమూరు జిల్లా :

శ్రీ కురుమూర్తి వెంకటేశ్వర స్వామి వారి బ్రహ్మోత్సవాల సందర్భంగా ముఖ్యమంత్రి స్వామి వారిని దర్శించుకున్నారు. దేవాలయంలో లక్ష్మీదేవి, భూదేవి అమ్మవార్లను దర్శించుకుని ఆశీర్వచనం తీసుకున్నారు. అంతకు ముందు శ్రీ కురుమూర్తి స్వామి ఆలయానికి రూ. 110 కోట్ల అంచనా వ్యయంతో చేపడుతున్న ఘాట్ రోడ్డు, ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడుతూ.. ఆలయ ప్రాశస్త్యాన్ని వివరించారు. దేవాలయ అభివృద్ధి కార్యక్రమాలకు అంచనాలు రూపొందించి నివేదిక ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. పాలమూరు జిల్లా వలసలకు మారుపేరు. గత పాలకుల నిర్లక్ష్యం కారణంగా పాలమూరు జిల్లాలో ప్రాజెక్టులు పూర్తి కాలేదు. ప్రజా ప్రభుత్వ భగీరథ ప్రయత్నాన్ని అడ్డుకోవాలని చూడొద్దు. వలసల నిరోధించడానికి జిల్లాలో ప్రాజెక్టులను పూర్తి చేసి పాడి పంటలతో విలసిల్లేలా ప్రభుత్వ నిర్ణయాలు ఉంటాయి. ఈ జిల్లా బిడ్డగా సాగునీటి ప్రాజెక్టులు పూర్తి చేయకపోతే నన్ను చరిత్ర క్షమించదు. అడ్డుకోవాలని చూసే వారిని పాలమూరు జిల్లా ప్రజలు క్షమించరు. అలాంటివారు చరిత్ర హీనులుగా మిగిలిపోతారు. జిల్లాలో అమర్‌రాజా బ్యాటరీస్ కంపెనీలో 2 వేల మంది స్థానిక నిరుద్యోగులకు నైపుణ్య శిక్షణ ఇచ్చి ఉద్యోగాలు ఇవ్వడానికి కంపెనీ అంగీకరించింది. ఈ ప్రాంతంలో ఏ కంపెనీలు వచ్చినా ఈ ప్రాంత నిరుద్యోగులకు శిక్షణ ఇచ్చి ఉద్యోగాలు ఇప్పించే బాధ్యత ప్రభుత్వానిది. జిల్లాలో గ్రామ గ్రామానికి, తండాలకు బీటీ రోడ్లు వేసే బాధ్యత మాది. ఆ దిశగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్లకు ఆదేశాలు. విద్య, వైద్యం, ఉపాధి అవకాశాలు కల్పించి జిల్లాను అభివృద్ధి పథంలో ముందుకు నడిపించుకుందాం అని ముఖ్యమంత్రి అన్నారు.

# నేడు ఏపీ అసెంబ్లీ సమావేశాలు

- ఈ సారి పూర్తిస్థాయి బడ్జెట్
- సభకు దూరంగా వైసీపీ..!




2 లో

ఏపీ అసెంబ్లీ శీతాకాల సమావేశాలు నేడు ప్రారంభం కానున్నాయి. ఈసారి పూర్తి స్థాయి బడ్జెట్ ను ప్రవేశపెట్టేందుకు సర్కార్ సిద్ధమైంది. మరోవైపు కీలక బిల్లులకు కూడా ఆమోదం తెలిపే అవకాశం ఉంది. ఇక ప్రతిపక్ష వైసీపీ గైర్హాజరుతో ఏకపక్షంగా సమావేశాలు జరగనున్నాయి.



2 లో

# డిక్లరేషన్లన్నీ పాములై రేవంత్ మెడలో పడతాయి

బీసీ డిక్లరేషన్ ఇచ్చి సంవత్సరం పూర్తయిన ఇప్పటిదాకా ఒక్క అడుగు ముందుకు పడలేదని.. కేటీఆర్ విమర్శించారు. బీసీ డిక్లరేషన్‌లో ఇచ్చిన హామీల అమలులో ప్రభుత్వం పూర్తిగా వైఫల్యమైందన్నారు. బీసీ డిక్లరేషన్ పేరుతో కాంగ్రెస్ బలహీన వర్గాలకు బలమైన వెన్నుపోటు పొడిచిందన్నారు.



# 51వ సీజేఐగా జస్టిస్ సంజీవ్ ఖన్నా

**సీజేఐగా జస్టిస్ డీవై చంద్రచూడ్ పదవి విరమణ చేశారు. సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ సంజీవ్ ఖన్నా నేడు ప్రమాణస్వీకారం చేయనున్నారు.**

భారత ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ డీవై చంద్రచూడ్ పదవీకాలం ముగిసింది. ఆదివారం పదవీ విరమణ చేశారు. ఆయన స్థానంలో జస్టిస్ ఖన్నా బాధ్యతలు చేపట్టారు. రాష్ట్రపతి భవన్‌లో నవంబర్ 11న ఉదయం 10 గంటలకు జరిగే

...మిగతాది 2 లో

# ఇదెక్కడి మోసం రా మావా..!


- యూట్యూబ్ ఛానెల్స్‌ను సబ్‌స్క్రైబ్ చేసినందుకు..



జయభేరి, హైదరాబాద్ :

యువతిని సైబర్ నేరగాళ్లు మోసగించారు. హైదరాబాద్ సైబర్ క్రైమ్ ఏసీపీ శివ మారుతి తెలిపిన వివరాల ప్రకారం.. నగరానికి చెందిన బాధిత యువతి ఓ ప్రైవేట్ కంపెనీలో పని చేస్తోంది. సదరు యువతికి వాట్సాప్‌లో పార్ట్ టైం జాబ్ ఉందని సైబర్ నేరగాళ్లు మెసేజ్ చేశారు.

యూట్యూబ్ ఛానెల్‌స్‌లను సబ్‌స్క్రైబ్ చేసి, తమకు స్క్రీన్ షాట్స్ పంపిస్తే డబ్బులు చెల్లిస్తామన్నారు. కొద్దీ రోజులు డబ్బులు చెల్లించడంతో బాధితురాలికి నమ్మకం కలిగింది. ఇంకా పెద్ద మొత్తంలో లాభాలు కావాలంటే.. ట్రేడింగ్‌లో ఇన్వెస్ట్ చేయాలని ఓ లింక్‌ను పంపించారు. అది నిజమని నమ్మిన యువతి తన వద్ద ఉన్న డబ్బులను పలు దఫాలుగా ఇన్వెస్ట్ చేసింది. ఇన్వెస్ట్మెంట్ డబ్బులకు లాభాలు వచ్చినట్లు నేరగాళ్లు వెబ్ సైట్లో చూపించారు. కొద్ది రోజులకు డబ్బులను విత్‌డ్రా చేయడానికి బాధితురాలు యత్నించగా.. డబ్బులు రాలేవు. దీంతో యువతి స్కామర్లను సంప్రదించగా వారు మరికొంత డబ్బులు ఇన్వెస్ట్ చేయాలని ఒత్తిడి చేశారు. ఇదంతా స్కామ్‌గా గ్రహించిన బాధితురాలు మొత్తం రూ.8 లక్షల 99 వేలు మోసపోయినట్లు గ్రహించి, పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏసీపీ వెల్లడించారు.



# విరుచుకుపడ్డ ఉక్రెయిన్


- మాస్కోపై 36 డ్రోన్లతో అటాక్

జయభేరి, ఉక్రెయన్ :

రష్యా, ఉక్రెయన్ యుద్ధం ఇప్పుడిప్పుడే ముగిసేలా కనిపించడం లేదు. ఇరుదేశాలు పరస్పరం దాడులు, ప్రతిదాడులకు దిగుతున్నాయి. ఉక్రెయిన్ ప్రాంతాలపై రష్యా బలగాలు దాడులు చేయగా, దానికి కౌంటర్‌గా ఉక్రెయిన్ పెద్ద సంఖ్యలో డ్రోన్లతో ప్రతీదాడులకు దిగింది. రష్యా రాజధాని మాస్కోపై 36 డ్రోన్లతో దాడులకు పాల్పడింది. ఉక్రెయిన్ దాడి తరువాత మాస్కో లోని ఎయిర్‌పోర్ట్‌లను మూసేశారు. ఉక్రెయిన్ తమ దేశంపై ఉగ్రదాడికి పాల్పడిందని రష్యా ఆరోపించింది. మాస్కోను లక్ష్యంగా చేసుకొని ఉక్రెయిన్ డ్రోన్లను ప్రయోగించిందన్నారు రష్యా అధికారులు. డ్రోన్ దాడుల కారణంగా మాస్కోలోని డొమోడెడోవో, జుకోవో విమానాశ్రయాలను తాత్కాలికంగా మూసివేయాల్సి వచ్చిందన్నారు. దాడుల కారణంగా ప్రాణ నష్టం జరగలేదని.. గాయపడ్డవారిని ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నామన్నారు రష్యా అధికారులు. ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్స్కీ స్పందిస్తూ, రష్యా ఇటీవల తమ దేశంపై 145 డ్రోన్లతో దాడి చేసిందని ఆరోపించారు. మరోవైపు ఉక్రెయిన్‌పై రష్యా దండయాత్ర మొదలుపెట్టి రెండున్నరేళ్లు దాటింది.

# కోడిపుంజు ఆకారంలో నిర్మించిన హోటల్..!

- గిన్నిస్ వరల్డ్ రికార్డ్ బ్రేక్..



ప్రపంచంలోనే అతిపెద్ద కోడిపుంజు ఆకారంలో ఉన్న ఎత్తైన భవనాన్ని మీరు ఎక్కడైనా చూశారా..? లేదుకాదా.. అయితే, దీని కోసం మీరు ఫిలిప్పీన్స్‌కు వెళ్లవలసి ఉంటుంది. ఆర్కిటెక్చర్, వాస్తుశిల్పులపై ఆసక్తి ఉన్నవారికి ఈ భవనం ఎంతగానో నచ్చుతుంది. క్యాంపుస్టోహాన్, నీగ్రోస్ ఆక్సిడెంటల్‌లో ఉన్న ఈ భారీ నిర్మాణం క్యాంపుస్టోహాన్ హైలాండ్ రిసార్ట్‌లో భాగంగా నిర్మించారు. ఈ భవనం పొడవు సుమారు 115 అడుగులు (34.931 మీటర్లు), వెడల్పు సుమారు 40 అడుగులు (12.127 మీటర్లు). 92 అడుగుల పొడవుతో ఆకట్టుకునేలా కట్టడం అంటే చిన్న విషయం కాదు. కోడి ఆకారంలో ఉన్న ఈ భవనంలో 15 గదులు ఉన్నాయి. ఇందులో అన్ని రకాల సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయి.

▶▶ మొదటిపేజీ తరువాయి

## నేడు ఏపీ అసెంబ్లీ సమావేశాలు

రాష్ట్ర అసెంబ్లీ శీతాకాల సమావేశాలు నేడు నుంచి ప్రారంభం కానున్నాయి. ఈసారి పూర్తి స్థాయి బడ్జెట్ పెడతారని చర్చ జరుగుతోంది. అయితే ఈ సమావేశాలకు ప్రతిపక్ష వైసీపీ హాజరుకావటం లేదు. కేవలం కూటమి ప్రభుత్వంలోని టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీలే హాజరుకానున్నాయి. మరోవైపు నేడు ఉదయం 9 గంటలకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధ్యక్షతన రాష్ట్ర మంత్రివర్గ సమావేశం కూడా ఉంది. సమావేశంలో బడ్జెట్ ప్రతిపాదనలకు రాష్ట్ర మంత్రి వర్గం ఆమోదం తెలపనుంది. ప్రస్తుత ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్ ఈ నెలాఖరుతో ముగుస్తుంది. ఇప్పటికే అసెంబ్లీ సమావేశాల నిర్వహణకు అధికార యంత్రాంగం విస్తృత ఏర్పాట్లు చేస్తోంది. అయితే కీలకమైన ప్రజా సమస్యలపై ఏ మేరకు చర్చకు వస్తాయన్నదే అనుమానంగా మారింది. ఎందుకంటే అసెంబ్లీ ఏకైక ప్రతిపక్ష పార్టీ వైసీపీ సమావేశాలకు దూరంగా ఉండటమే దీనికి కారణం. ప్రతిపక్ష పార్టీ లేకుండా సమావేశాలు నిర్వహించడంతో కేవలం ఇవి కూటమి పార్టీ సమావేశాలుగానే ఉంటాయని విశ్లేషకులు అభిప్రాయ పడుతున్నారు.

**ప్రతిపక్ష హోదా ఇవ్వనందుకే...!**

తమకు ప్రతిపక్ష హోదా ఇవ్వనందుకు నిరసనగా అసెంబ్లీ సమావేశాలను బహిష్కరిస్తున్నట్లు మాజీ ముఖ్యమంత్రి, వైసీపీ అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రకటించారు. తన నివాసం నుంచే మీడియా ద్వారానే ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తామని ప్రకటించారు. తనకు అసెంబ్లీలో మాట్లాడటానికి ఎక్కువ సమయం మైక్ ఇవ్వల్సి వస్తుందేమోనని ప్రతిపక్ష హోదా ఇవ్వడం లేదని ఆయన అన్నారు. అసెంబ్లీకి గైర్హాజరు కావాలని వైసీపీ తీసుకున్న నిర్ణయంపై కూటమి పార్టీలు తీవ్రంగా విమర్శలు ఎక్కుపెట్టాయి. తాము నిలదీస్తామేమోనని వైసీపీ ఈ సమావేశాలకు రాకూడదని నిర్ణయించుకుందని మంత్రి అచ్చెన్నాయుడు మండిపడ్డారు. వైసీపీ సభ్యులకు గత సమావేశాల్లో మైక్ ఇచ్చామని, ఈసారి కూడా ఇస్తామని చెప్పారు. సభకు వచ్చి వారి అభిప్రాయాలు చెప్పొచ్చని, అంతేతప్ప మైక్ ఇవ్వలేదనడం సరికాదని అన్నారు. గత ప్రభుత్వ అవినీతి, అక్రమాలు, నియంతృత్వంపై నిలదీస్తామనే సభకు రావటం లేదని పేర్కొన్నారు.

**ఇది మొదటిసారా..?**

అయితే అసెంబ్లీకి ప్రతిపక్షం దూరంగా ఉండటం ఇది మొదటి సారి కాదు. రాష్ట్ర విభజన జరిగిన తరువాత ఏర్పడిన ప్రతి శాసనసభలోనూ ఇదే పరిస్థితి నెలకొంది. రాష్ట్ర విభజన అనంతరం 2014లో టీడీపీ, బీజేపీ కూటమి ప్రభుత్వంలో అప్పుడు ప్రతిపక్షంలో ఉన్న వైసీపీ కొంత వరకు అసెంబ్లీకి హాజరై, ప్రభుత్వంపై విమర్శలు చేసి సమావేశాలను బహిష్కరించింది. 2019లో వైసీపీ అధికారంలోకి రాగానే ప్రతిపక్షంలో ఉన్న చంద్రబాబు నేతృత్వంలో టీడీపీ కూడా కొంత వరకు అసెంబ్లీకి హాజరై, ఆ తరువాత తనకు అవమానం జరిగిందని చంద్రబాబు అసెంబ్లీ సమావేశాలను బహిష్కరించారు. తాను సీఎం అయిన తరువాతే మళ్లీ సభలో అడుగుపెడతానని ప్రకటించి, నాటి నుండి అసెంబ్లీ సమావేశాలకు హాజరుకాలేదు. మళ్లీ ఇప్పుడు వైసీపీ వంతు రావడంతో మొదటి సమావేశాలకు హాజరుకాలేదు. దీంతో కనీసం ప్రతిపక్ష హోదా లేకపోవడంతో మాట్లాడేందుకు సమయం చాలా తక్కువ ఇస్తారు. ఈ నేపథ్యంలో తమకు మాట్లాడేందుకు ఎక్కువ సమయం ఉండదని, అసెంబ్లీ బయటనుంచే ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తామని చెప్పి సమావేశాలను బహిష్కరించింది.

## పాములై రేవంత్ మెడలో పడతాయి



హామీలు ఇచ్చి ఓట్లు దండుకొని అధికారంలోకి వచ్చిన తర్వాత మోసం చేసిన రేవంత్, బీసీ బిడ్డలకు క్షమాపణలు చెప్పాలని.. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. బీసీ కుల గణన చేయాల్సిందేనని.. 42 శాతం రిజర్వేషన్లు ఇచ్చినంకనే స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం పైన నమ్మకం లేకనే కులగణనకు వెళ్లిన అధికారులను ప్రజలు ప్రశ్నిస్తున్నారని వ్యాఖ్యానించారు. ఇచ్చిన హామీలను రేవంత్ ఎందుకు అమలు చేయడం లేదంటూ.. ఇంటికి వచ్చిన ప్రభుత్వాధికారులను ప్రశ్నించాలని కేటీఆర్ పిలుపునిచ్చారు. ప్రభుత్వ విధానాల పైన ప్రజలకు ప్రశ్నించే హక్కు ఉంటుందని.. ప్రజలను ఒప్పించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని స్పష్టం చేశారు. 60 ఏళ్ల పాటు బీసీలకు అన్యాయం చేసిన పార్టీ కాంగ్రెస్ అని.. 60 ఏళ్లలో కేంద్రంలో బీసీ మంత్రిత్వ శాఖ కూడా ఏర్పాటు చేయలేని చరిత్ర కాంగ్రెస్‌దే అని కేటీఆర్ విమర్శలు గుప్పించారు. 'కాంగ్రెస్ ఏడాది వైఫల్యాల పైన మేము కూడా వారోత్సవాలు నిర్వహిస్తాం. రేవంత్ రెడ్డి మహారాష్ట్ర వెళ్లి అబద్ధాలు మాట్లాడుతున్నాడు. ఎవని అయ్యా సొమ్ము అని అబద్ధాలతో ఫుల్ పేజీ యాడ్లు వేస్తున్నారు. సరిగ్గా సంవత్సరం కింద ఇదే రోజు కామారెడ్డిలో బీసీ డిక్లరేషన్ పేరిట కాంగ్రెస్ పార్టీ బీసీలకు అనేక హామీలు ఇచ్చింది. ఆడపిల్లల ఓట్ల కోసం బలహీన వర్గాల ఓట్ల కోసం దొంగ హామీలను ఇచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఒక్కటంటే ఒక్క బీసీ డిక్లరేషన్ హామీ అయినా అమలు చేసిందా?' అని కేటీఆర్ ప్రశ్నించారు.

'కొత్త పథకాల విషయం దేవుడెరుగు.. ఉన్న వాటిని కూడా కాంగ్రెస్ ఎత్తగొట్టింది. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో చేతి వృత్తులకు చేయూతనిస్తూ బలహీన వర్గాలకు విద్య, వృత్తి లాంటి అన్ని అవకాశాల్లో ఆసరాగా నిలిచింది. పథకాలన్నింటికీ పాతర వేసిన పాపాత్ములు కాంగ్రెస్ నాయకులు. బీఆర్ఎస్ ప్రభుత్వం దళిత బంధు తర్వాత బీసీల కోసం బీసీ బంధు ప్రవేశపెట్టింది. కానీ రేవంత్ రెడ్డి రాగానే బీసీ బంధు, రైతుబంధు, దళిత బంధు ఇలా అన్ని బంద్ అయినయి' అని కేటీఆర్ వ్యాఖ్యానించారు. 'కుల గణన కచ్చితంగా చేయాల్సిందే. కుల గణన పూర్తయిన తర్వాతనే, 42% రిజర్వేషన్ ఇచ్చిన తర్వాతనే స్థానిక సంస్థల ఎన్నికలు పెట్టాలి. ఆరు నెలల్లో స్థానిక సంస్థల్లో 42 శాతం బీసీ రిజర్వేషన్లు అమలు చేస్తామని చెప్పి ఏడాది దాటిన అమలు చేయలేదు. 42 శాతం రిజర్వేషన్లు అమలు అయినంకనే ఎన్నికలు పెట్టాలని ఇంటికి వచ్చే ప్రభుత్వాధికారులను, కాంగ్రెస్ నాయకులను, కార్యకర్తలను ప్రజలు నిలదీయాలి' అని కేటీఆర్ పిలుపునిచ్చారు

'మూడు లక్షల ఆదాయమున్న ప్రతి బీసీ కుటుంబానికి పూర్తి ఫీజు రీయంబర్స్‌మెంట్ ఎక్కడ పోయింది. ప్రతి మండలంలో ఒక గురుకులం అన్నారు. ఎక్కడికి పోయింది? ప్రతి జిల్లా కేంద్రంలో బీసీ గురుకుల డిగ్రీ కాలేజ్ అన్నారు.. బీసీలకు 10 లక్షల వడ్డీ లేని రుణమిస్తా అని చెప్పారు. ఒక్క బీసీ బిడ్డకు అయినా రుణం ఇచ్చారా? ఐదేళ్లలో బీసీల సంక్షేమ కోసం సంవత్సరానికి 20 వేల కోట్ల చొప్పున ఐదు సంవత్సరాలలో లక్ష కోట్లు ఖర్చు పెడతామని చెప్పారు. కేవలం 8 వేల కోట్ల రూపాయలు మాత్రమే బడ్జెట్లో కేటాయించారు. అందులో ఎంత ఖర్చు పెడతారో ఎవరికీ తెలియదు' అని కేటీఆర్ వ్యాఖ్యానించారు. 'సర్పంచులకు పెండింగ్‌లో ఉన్న బకాయిలు వెంటనే చెల్లించాలి. బీసీ వెల్ఫేర్ శాఖతోపాటు ఎంబీసీలకు మరొక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేస్తా అన్నారు. ఉన్న మంత్రులనే నింపుకోలేని అసమర్థుడు రేవంత్ రెడ్డి. కొత్త మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేస్తా అంటే ఎవరు నమ్ముతారు? రాష్ట్రానికి అవసరం ఉన్న 18 మందిని నింపుకోలేని చేతకానివారు రేవంత్ రెడ్డి. అన్ని జిల్లా కేంద్రాల్లో 50 కోట్లతో బీసీ కన్వెన్షన్ హాల్ ఏర్పాటు చేస్తా అన్నారు, ఒక్కదానికైనా కనీసం పని మొదలైందా?' అని కేటీఆర్ ప్రశ్నించారు. 'ముఖ్యమంత్రి హోదాలో రేవంత్ అడ్డగోలుగా మాట్లాడుతున్నడు. ధాన్యానికి రూ. 500 బోనస్ ఇస్తానని చెప్పి మాట తప్పినవ్. అబద్ధాల ముఖ్యమంత్రిని తెలంగాణ రాష్ట్ర సమితి తరపున అడుగుతూనే ఉంటాం.. నిలదీస్తూనే ఉంటాం. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన డిక్లరేషన్లన్నింటిపైనా ప్రశ్నిస్తూనే ఉంటాం. డిక్లరేషన్లన్నీ పాములై రేవంత్ మెడలో పడతాయి. అన్ని డిక్లరేషన్లు అమలు అయ్యేదాకా రేవంత్‌ను వదిలిపెట్టం' అని కేటీఆర్ స్పష్టం చేశారు.

# కులగణనపై కాంగ్రెస్ ఆశలు

**దేశ రాజకీయాలు కుల, మతం మధ్య నలిగిపోతున్నాయి. బీజేపీ చేస్తున్న హిందూత్వ రాజకీయాలకు కులం ద్వారానే కౌంటర్ ఇస్తేనే వర్కవుట్ అవుతుందన్న నిర్ణయానికి వచ్చిన రాహుల్ గాంధీ తమ పార్టీ సింగిల్ ఎజెండాగా కులగణనను తీసుకుని దేశవ్యాప్తంగా పర్యటిస్తున్నారు. తాము అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో కులగణనను ప్రతిష్ఠాత్మకంగా చేయిస్తున్నారు. తెలంగాణలో కులగణన ప్రారంభించే ముందు వచ్చి ఆయన ఇచ్చిన సందేశం ఈ విషయాన్ని క్లియర్ చేస్తోంది.**



✍ **జయభేరి, హైదరాబాద్ :**

కులగణన చేసి రిజర్వేషన్ల పరిమితిని ఎత్తేస్తామని ఆయన చెప్పడం ఈ వ్యూహంలో భాగం అనుకోవచ్చు. స్వతంత్ర భారతావనిలో జరిగిన ఏ ఎన్నికలను చూసుకున్నా రాజకీయ పార్టీల రాజకీయం, ఎన్నికల వ్యూహాలు మొత్తం కులం ప్రకారమే ఉంటాయి. స్వాతంత్రం వచ్చిన మొదట్లో కాంగ్రెస్ పార్టీకి అన్ని వర్గాల నుంచి మద్దతు ఉండేది.రాను రాను కాంగ్రెస్ కేవలం ముస్లింలు, దళితల మద్దతునే నిలబెట్టుకోగలిగింది. నిజానికి చాలా రాష్ట్రాల్లో ఈ వర్గాలు కూడా వేరే పార్టీల వైపు వెళ్లిపోయాయి. యూపీ వంటి రాష్ట్రాల్లో అసలు కాంగ్రెస్ కు ఓటు బ్యాంక్ లేకుండా పోయింది. ఇలాంటి సమయంలో కాంగ్రెస్ పార్టీ కనీసం వంద లోక్ సభ సీట్లు గెల్చుకోవడమే ఓ పెద్ద సవాల్ గా మారింది. కాంగ్రెస్ పార్టీ దశాబ్దాలుగా తమ పార్టీని వదిలేసిన కులాలను ఆకట్టుకోవడానికి ఇప్పుడుకొత్తగా ప్రయత్నాలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. అలాంటి అస్త్రమే కులగణన. దేశంలో జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు కల్పించాలన్న డిమాండ్లు వినిపిస్తున్నాయి. రిజర్వేషన్లపై యాభై శాతం పరిమితి ఉంది. అందుకే చాలా రాష్ట్రాల్లో రాజకీయ పార్టీలు తీర్మానాలు చేసి కేంద్రానికి పంపించి చేతులు దులిపేసుకుంటున్నాయి. ఇదే అంశాన్ని పట్టుకున్న రాహుల్ గాంధీ ..తాము అధికారంలోకి వస్తే పార్లమెంట్ చట్టం ద్వారా రిజర్వేషన్ల పరిమితి ఎత్తేసి కులగణన చేపట్టి అందిరకీ అవకాశాలు కల్పిస్తామని అంటోంది. రాహుల్ గాంధీ ఈ వాదనను బలంగా ప్రజల్లోకి తీసుకెళ్తున్నారు. కులాల పరంగా అందరికీ అవకాశాలు కల్పిస్తామని రాహుల్ గాంధీ అంటున్నారు. దేశంలోని అన్ని వ్యవస్థల్లో కుల వివక్ష ఉందన్నారు. రాజకీయ న్యాయవ్యవస్థల్లో ఉందని రాహుల్ గాంధీ స్పష్టం చేశారు. దేశంలోని పారిశ్రామికవేత్తల్లో ఎస్సీ, ఎస్టీ, గిరిజన కమ్యూనిటీలకు ప్రాతినిధ్యం తక్కువగా ఉందని ప్రతిభ ఉన్నప్పటికీ వారికి పాలనా వ్యవస్థలో భాగస్వాములయ్యే అవకాశం కింది కులాలకు రావడం లేదన్నారు. అందువల్లే తాము కులగణన చేపట్టామని చెబుతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వాలు చేపడుతున్న కులగణన అంటే అది కేవలం కులాల లెక్కలు కాదు. ప్రభుత్వ విధానాల రూపకల్పనకు పునాది అని రాహుల్ గాంధీ స్పష్టంచేశారు. మేము దేశాన్ని చీల్చాలని ప్రయత్నం చేస్తున్నాం అంటున్నారని...దేశంలో సంపదను ఎవరి వాటా వారికి ఇవ్వడం దేశాన్ని చీల్చడమా అని రాహుల్ ప్రశ్నించారు. ప్రజల ఆలోచనలకు అనుగుణంగా ప్రశ్నలు తయారు చేయాలని రాహుల్ సూచించారు.

> **దేశంలోని పారిశ్రామికవేత్తల్లో ఎస్సీ, ఎస్టీ, గిరిజన కమ్యూనిటీలకు ప్రాతినిధ్యం తక్కువగా ఉందని ప్రతిభ ఉన్నప్పటికీ వారికి పాలనా వ్యవస్థలో భాగస్వాములయ్యే అవకాశం కింది కులాలకు రావడం లేదన్నారు. అందువల్లే తాము కులగణన చేపట్టామని చెబుతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వాలు చేపడుతున్న కులగణన అంటే అది కేవలం కులాల లెక్కలు కాదు. ప్రభుత్వ విధానాల రూపకల్పనకు పునాది అని రాహుల్ గాంధీ స్పష్టంచేశారు.**

కులగణన చేసినంత మాత్రాన సరిపోదు. వివిధ కులాల మధ్య సంపద పంపిణీ ఎలా ఉందో అధ్యయనం చేయాలి.

అదేవిధంగా బ్యూరోక్రసీ, జ్యుడిషియరీ, మీడియాలో ఓబీసీలు, దళితులు, కార్మికుల భాగస్వామ్యం ఎంతుందో కూడా తెలుసుకోవాల్సి ఉందన్నారు. అందుకే కులగణన చేపట్టామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం కులగణన జరుపుతుందని, రిజర్వేషన్లపై 50 శాతం పరిమితిని తొలగిస్తుందని స్పష్టంచేశారు బీసీ వర్గాలను ప్రధానంగా ఆయన టార్గెట్ చేసుకున్నారు. ప్రతి వర్గం తమ జనాభాఎక్కువ ఉందని తమకు ఇంకా ఎక్కువ అవకాశాలు రావాల్సి ఉందని అనుకుంటూ ఉంటారు. ఖచ్చితంగా రాహుల్ అదే పాయింట్ ను పట్టుకున్నారు. తెలంగాణ కులగణనలో వచ్చే ఫలితాలతో అధికారికంగా రిజర్వేషన్లు కల్పించలేకపోవచ్చు కానీ అనధికారికంగా స్థానిక సంస్థల ఎన్నికల్లో జనాభా దామాషా ప్రకారం సీట్లు కేటాయించి తాము చిత్తశుద్ధితో ఉన్నామని నిరూపించి..దేశవ్యాప్తంగా ఈ మోడల్ చూపించాలని అనుకుంటున్నారు. మరోవైపు తెలంగాణలో గత 5 ఏళ్లలో రుణాలు తీసుకుని ఉంటే.. ఏ అవసరం కోసం తీసుకున్నారు.. ఎక్కడి నుంచి తీసుకున్నారు..? వంటి వివరాలు పార్ట్2లో పొందుపరిచారు. కుటుంబ సభ్యులందరి మొత్తం స్థిర, చరాస్తులతో ఇంటికి సంబంధించిన పూర్తి వివరాలు సేకరిస్తారు. వ్యవసాయ భూములు ఉంటే.. ధరణి పాస్‌బుక్ నంబర్‌తో పాటు భూమి రకం, నీటిపారుదల వనరు, కౌలు సాగుభూమి తదితర వివరాలను సేకరిస్తారు. చివరగా ఎన్యుమరేటర్‌కు అందించిన సమాచారం నిజమని ప్రకటిస్తూ కుటుంబ యజమాని సంతకం చేయాల్సి ఉంటుంది.స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ ఇస్తామని హామీ ఇచ్చింది..కాంగ్రెస్ పార్టీ. కులగణన చేస్తామంటూ తన మేనిఫెస్టోలో కూడా ప్రకటించింది. అధికారంలోకి వచ్చాక అసెంబ్లీలో తీర్మానం చేయడమే గాక, కులగణనకు 150 కోట్లరూపాయలు కేటాయిస్తూ జీవోకూడా జారీ చేసింది రేవంత్ సర్కారు.ఈ సర్వేతో పెనుమార్పులొస్తాయని ప్రభుత్వం చెబుతుంటే..విపక్షాలు మాత్రం పలు ప్రశ్నలు లేవనెత్తుతున్నాయి. అయితే ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న సర్వే ఎలా సాగబోతోంది? చివరికేం తేలబోతోంది? అన్నది పక్కన పెడితే సర్వే నేపథ్యంలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ రాక ఆసక్తికరంగా మారింది.మొత్తంగా కులంతో బలపడాలని కాంగ్రెస్ విశ్వ ప్రయత్నాలు చేస్తోంది. ప్రజలు ఎంత వరకూ నమ్ముతారో మరి..!

## 51వ సీజేఐగా జస్టిస్ సంజీవ్ ఖన్నా

కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రమాణ స్వీకారం చేయించనున్నారు. ఆయన పదవీకాలం మే 13, 2025 వరకు ఉంటుంది. పలు కీలకమైన సుప్రీం కోర్టు తీర్పుల్లో భాగమైన జస్టిస్ సంజీవ్ ఖన్నా సోమవారం భారత 51వ ప్రధాన న్యాయమూర్తిగా ప్రమాణ స్వీకారం చేస్తారు. అక్టోబరు 16న చీఫ్ జస్టిస్ చంద్రచూడ్ సిఫారసు మేరకు అక్టోబర్ 24న జస్టిస్ ఖన్నా నియామకాన్ని కేంద్రం అధికారికంగా తెలియజేసింది. శుక్రవారం జస్టిస్ చంద్రచూడ్ సీజేఐగా చివరి పనిదినం కావడంతో ఘనంగా వీడ్కోలు పలికారు. తదుపరి సీజేఐగా జస్టిస్ ఖన్నా బాధ్యతలు తీసుకున్నారు. జనవరి 2019 నుండి సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా పనిచేసిన జస్టిస్ ఖన్నా.. ఈవీఎంల పవిత్రతను సమర్థించడం, ఎలక్టోరల్ బాండ్ల పథకాన్ని రద్దు చేయడం, ఆర్టికల్ 370 రద్దును సమర్థించడం, ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌కు మధ్యంతర బెయిల్ మంజూరు చేయడం వంటి అనేక కీలక తీర్పులలో భాగంగా ఉన్నారు. ఢిల్లీకి చెందిన ప్రముఖ కుటుంబం నుండి వచ్చిన జస్టిస్ ఖన్నా ఢిల్లీ హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ దేవ్ రాజ్ ఖన్నా కుమారుడు. ప్రముఖ మాజీ సుప్రీంకోర్టు న్యాయమూర్తి హెచ్ ఆర్ ఖన్నా మేనల్లుడు. జనవరి 18, 2019న సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా పదోన్నతి పొందారు. సుప్రీంకోర్టులో జస్టిస్ సంజీవ్ ఖన్నా కూడా కీలకమైన తీర్పుల్లో భాగంగా ఉన్నారు. ఎన్నికలలో ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషీన్ల వినియోగాన్ని సమర్థిస్తూ, పరికరాలు సురక్షితంగా ఉన్నాయని, బూత్ క్యాప్చరింగ్, బోగస్ ఓటింగ్‌ను తొలగించాయని చెప్పారు. ఏప్రిల్ 26న జస్టిస్ ఖన్నా నేతృత్వంలోని ధర్మాసనం ఈవీఎంలలో అవకతవకలు జరుగుతున్నాయనే అనుమానాన్ని నిరాధారం అని పేర్కొంది. పాత పేపర్ బ్యాలెట్ విధానాన్ని తిరిగి మార్చాలనే డిమాండ్‌ను తిరస్కరించింది. రాజకీయ పార్టీలకు నిధులు సమకూర్చేందుకు ఉద్దేశించిన ఎలక్టోరల్ బాండ్ పథకాన్ని రాజ్యాంగ విరుద్ధమని ప్రకటించిన ఐదుగురు న్యాయమూర్తుల బెంచ్‌లో ఆయన కూడా ఉన్నారు. జమ్మూ కాశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తిని కల్పించే రాజ్యాంగంలోని ఆర్టికల్ 370ని రద్దు చేస్తూ కేంద్రం 2019లో తీసుకున్న నిర్ణయాన్ని సమర్థించిన ఐదుగురు న్యాయమూర్తుల బెంచ్‌లో జస్టిస్ ఖన్నా భాగం. ఎక్సైజ్ పాలసీ కుంభకోణం కేసులో లోక్‌సభ ఎన్నికల్లో ప్రచారం చేసేందుకు తొలిసారిగా అప్పటి ముఖ్యమంత్రి కేజ్రీవాల్‌కు జూన్ 1 వరకు మధ్యంతర బెయిల్ మంజూరు చేసింది జస్టిస్ ఖన్నా నేతృత్వంలోని ధర్మాసనం.

1960 మే 14న జన్మించిన ఆయన ఢిల్లీ యూనివర్సిటీ క్యాంపస్ లా సెంటర్‌లో న్యాయశాస్త్రం అభ్యసించారు. జస్టిస్ ఖన్నా నేషనల్ లీగల్ సర్వీస్ అథారిటీ (NALSA)కి ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్‌గా ఉన్నారు. 1983లో ఢిల్లీ బార్ కౌన్సిల్‌లో న్యాయవాదిగా నమోదు చేసుకున్నారు. మొదట దిల్లీలోని తీస్‌హజారీ కాంప్లెక్స్‌లోని జిల్లా కోర్టులలో ప్రాక్టీస్ చేశారు. తరువాత ఢిల్లీ హైకోర్టులో ప్రాక్టీస్ చేశారు. ఆదాయపన్ను శాఖకు సీనియర్ స్టాండింగ్ కౌన్సెల్‌గా సుదీర్ఘ కాలం ఉన్నారు. జస్టిస్ ఖన్నా ఢిల్లీ హైకోర్టులో అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా, అమికస్ క్యూరీగా అనేక క్రిమినల్ కేసుల్లో కూడా వాదించారు. ఎన్నో కీలక కేసుల్లో జస్టిస్ ఖన్నా తీర్పులు ఇచ్చారు. నవంబర్ 11న 51వ సీజేఐగా ప్రమాణస్వీకారం చేయనున్నారు.

# వడ్లు కొంటున్నారా? బోనస్ ఇచ్చారా?

### బోనస్ తప్పించుకోవడానికే ధాన్యం కొనుగోళ్లలో జాప్యం చేస్తున్నారన్న బండి సంజయ్



తెలంగాణలో రైతులకు బోనస్ చెల్లించకపోవడంపై కేంద్ర మంత్రి బండి సంజయ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. వడ్ల పైసలన్నీ మిత్తీతో సహా కేంద్రమే చెల్లిస్తోందన్నారు. అయినప్పటికీ వడ్లు కొనివ్వడానికి కాంగ్రెస్ ప్రభుత్వానికి వచ్చిన మిత్తీతో సహా నొప్పి ఏందని ప్రశ్నించారు.కరీంనగర్ జిల్లా శంకరపట్నం మండలం కొత్తగట్టు లో ధాన్యం కొనుగోళ్ళను కేంద్రమంత్రి బండి సంజయ్ పరిశీలించారు. వడ్ల కొనుగోలులో రైతులు పడుతున్న ఇబ్బందులపై ఆరా తీశారు. 'నేషనల్ హైవేపైన వడ్లు పోశారు? ఎన్నాళ్లయింది? వడ్లు కొంటున్నారా? బోనస్ ఇచ్చారా? కనీస మద్దతు ధర ఇస్తున్నారా? తాలు, తరుగు, తేమ లేకుండా వడ్లు కొంటున్నారా?''అని అడిగారు. నెలరోజులైనా వడ్లు కొనడం లేదని, అడ్డికి పావుశేరు బ్రోకర్లకు అమ్ముకోవాల్సి వస్తుందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. వరికోసి నెలరోజులు అవుతున్నా ఇంకా కొనుగోలు కాలేదని...ప్రతి ఏటా నష్టపోతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని తెలిపారు. రైతుల సమస్యలను విన్న బండి సంజయ్ రాష్ట్ర ప్రభుత్వ తీరుపై ఫైర్ అయ్యారు. మిత్తీతో సహా వడ్ల పైసలన్నీ కేంద్రమే ఇస్తోందని తెలిపారు. సుతిలి తాడుసహా రవాణా ఖర్చులన్నీ కేంద్రం భరిస్తోందని ఇలాంటి పరిస్థితుల్లో వడ్ల కొనడానికి మీకున్న నొప్పేందని ప్రశ్నించారు. వడ్ల కొనుగోలు విషయంలో రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన యాక్షన్ ప్లాన్ కు, ఆచరణకు పొంతనే లేదన్నారు. కొనుగోలు కేంద్రాలు కూడా నేటికీ పూర్తిగా ప్రారంభించలేదని పేర్కొంటూ సర్కార్ గణాంకాలతోసహా వివరిస్తూ కాంగ్రెస్ ను తూర్పారపట్టారు.

**భారీ లక్ష్యం.. కొన్నది కొద్దిగా..**

ఈ వానా కాలం సీజన్ లో 95 లక్షల మెట్రిక్ టన్నుల వడ్లు సేకరించాలని రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. గత నెల అక్టోబర్ ఒకటో తేదీ నుండే వడ్లు కొనుగోలు చేస్తామని ప్రకటించారు. 7,572 వడ్ల కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినం, అక్టోబర్ నెలలోనే 8 లక్షల మెట్రిక్ టన్నులు, నవంబర్ లో 33 లక్షల మెట్రిక్ టన్నుల వడ్లను కొనుగోలు చేస్తామని చెప్పారు. ఏ నెల ఎన్ని లక్షల మెట్రిక్ టన్నుల వడ్లను కొనాలో కూడా యాక్షన్ ప్లాన్ ప్రకటించారు. కానీ నవంబర్ 10 వరకు ప్రభుత్వ లెక్కల ప్రకారం 20 లక్షల మెట్రిక్ టన్నుల వడ్లు కూడా కొనుగోలు చేయలేదన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 7,572 వడ్ల కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినప్పుడు...6017 కేంద్రాలు మాత్రమే ఓపెన్ చేసిర్రు. ఇంకా 1724 కేంద్రాలు ఇంకా ఓపెనే చేయలే.. మరి ఈ ప్రభుత్వాన్ని ఏమనాలన్నారు. గతేడాదితో పోలిస్తే కూడా ఈసారి చాలా తక్కువ వడ్లు కొన్నారని తెలిపారు. గత ఏడాది ఇదే సమయానికి 2 లక్షల మెట్రిక్ టన్నుల వడ్లు కొన్నారని తెలిపారు. ఈసారి లక్ష మెట్రిక్ టన్నులు కూడా కొనలే. అందుకే నేను పదేపదే చెబుతున్న. రైతులు, తెలంగాణ ప్రజల పరిస్థితి పెనం మీద నుండి పొయ్యిలో పడ్డట్లయిందని... పోనీ వడ్లు రాలేదా? అంటే... ఇప్పటికే 30 లక్షల మెట్రిక్ టన్నులకు పైగా వడ్లు వచ్చినయ్. రైతులంతా నెలరోజులు కొనుగోలు కేంద్రాల్లోనే వడ్లు పోసి ఎదురు చూసిర్రు. రోడ్లపైన రాశులు పోసిర్రు.. అయినా ప్రభుత్వం వడ్లు కొనకుండా అరిగోస పెట్టడంతో విసిగిపోయిన రైతులు అడ్డికి పావుశేరుకు మిల్లర్లకు అమ్ముకుంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.

ఏడాది పాలనపై కాంగ్రెస్ పార్టీ ప్రజా విజయోత్సవాలు నిర్వహించాలని నిర్ణయించడంపై బండి సంజయ్ తనదైన శైలిలో సెటైర్లు వేశారు. "ఏం సాధించారని ప్రజా విజయోత్సవాలు చేసుకుంటున్నారు?.. 6 గ్యారంటీలు అమలు చేశారని విజయోత్సవాలు చేసుకుంటున్నారా? నిరుద్యోగులకు 2 లక్షల ఉద్యోగాలు, మహిళలకు తులం బంగారం, స్కూటీ, నెలనెలా రూ.2500 లు ఇచ్చారని విజయోత్సవాలు చేసుకుంటారా? వృద్ధులకు రూ.4 వేల ఆసరా పెన్షన్ ఇచ్చారని చేసుకుంటారా? పేదలకు ఇండ్లు ఇచ్చారని చేసుకుంటారా? దేనికోసం విజయోత్సవాలు...నమ్మించి ఓట్లేయించుకుని మోసం చేసినందుకు ప్రజా వంచన ఉత్సవాలు చేసుకోండి.''అంటూ దుయ్యబట్టారు.

**ఆలయాల ధ్వంసంపై....**

రాష్ట్రంలోని ఆలయాలపై వరుస దాడులు జరుగుతున్నా కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు బండి సంజయ్. మొన్ననే శంషాబాద్ హనుమాన్ ఆలయంలో నవగ్రహాలను ధ్వంసం చేశారు. ఆ ఘటన మరవక ముందే శంషాబాద్ లోనే మళ్లీ గుడిని సల్మాన్ అనేటోడు దాడి చేసిండు. వరుస ఘటనలను చూస్తుంటే కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక ఆలయాలను ధ్వంసం చేసేందుకు ప్రత్యేక దళాలు ఏమైనా వచ్చాయా? అనే అనుమానం కలుగుతుందన్నారు. ఎందుకంటే కాంగ్రెస్ ప్రభుత్వం చూసీ చూడనట్లు పోతోంది కాబట్టి ఏం చేసినా పట్టించుకోరని దాడులకు తెగబడుతున్నారని తెలిపారు.

# ఇంటింటి కుటుంబ సర్వేను పరిశీలించిన జిల్లా కలెక్టర్

■ అన్ని వివరాలను జాగ్రత్తగా నింపాలని ఎన్యూమరేటర్లకు సూచన

జయభేరి, నవంబర్ 10:
ప్రభుత్వం నిర్వహిస్తున్న సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేలో భాగంగా సర్వే నిర్వహిస్తున్న అధికారులకు కుటుంబ సభ్యులు సహకరించాలని మేడ్చల్ మల్కాజ్ గిరి జిల్లా కలెక్టర్ గౌతమ్ పొట్రు కోరారు. ఆదివారం నిజాంపేట్ , బాచుపల్లి లో నిర్వహిస్తున్న సర్వేను కలెక్టర్ గౌతం పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్యుమరేటర్లకు నిర్దేశిత





ప్రొఫార్మాల నమోదు లను కోడింగ్ ను జాగ్రత్తగా నింపాలని, ఎన్యుమరేటర్లు పూరించిన ప్రొఫార్మాలలో ప్రత్యేకించి కోడింగ్ ను సూపర్ వైజర్లు క్షుణ్ణంగా పరిశీలించాలని ఆయన సూచించారు. ఈ సందర్భంగా ఏవిధంగా ప్రొఫార్మాలను నింపుతున్నారని ఎన్యుమరేటర్లు కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఎన్యుమరేటర్లు పూరించిన ప్రొఫార్మాలను క్షుణ్ణంగా పరిశీలించి ప్రొఫార్మాలలో నిర్దేశించిన చోట పుస్తకంలో ఇచ్చిన విధంగా కోడింగ్ లను నింపాలని ఎన్యుమరేటర్లకు సూచించారు. ఈ కార్యక్రమంలో నిజాంపేట కార్పొరేటర్ విజయలక్ష్మి మున్సిపల్ కమిషనర్ షబ్బీర్ అలీ, తహసీల్దారు ఫూల్ సింగ్, నోడల్ అధికారి ఇందిర, సూపర్ వైజర్లు, ఎన్యుమరేటర్లు, తదితరులు పాల్గొన్నారు.



## ఇంటింటి కుటుంబ సర్వే సందర్భంగా జిల్లా కలెక్టరేట్ లో ప్రజావాణి రద్దు

■ జిల్లా ప్రజలు గమనించాలని కలెక్టర్ గౌతమ్ విజ్ఞప్తి

జయభేరి, నవంబర్ 10:
రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఇంటింటి కుటుంబ సర్వే మేడ్చల్ మల్కాజ్ గిరి జిల్లాలో కొనసాగుతోంది. అయితే జిల్లా యంత్రాంగం మరియు జిల్లా అధికారులు ఈ సర్వేలో విధులు నిర్వహిస్తున్న కారణంగా సోమవారం కలెక్టరేట్లో నిర్వహించాల్సిన ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్లు మే జిల్లా కలెక్టర్ గౌతం తెలిపారు. ఈ విషయాన్ని జిల్లా ప్రజలందరూ గమనించ వలసిందిగా కలెక్టర్ కోరారు.

## మృతుల కుటుంబాలకు ఆర్థిక సహాయం అందజేత..




జయభేరి, గజ్వేల్, నవంబర్ 10 :
అనారోగ్యంతో కారణంతో పాతూరు గ్రామానికి చెందిన శెట్టి శివయ్య, నెంటూరి సాయమ్మ ఇద్దరు చనిపోవడంతో వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలుపుతూ ఇరువురి కుటుంబీకులను పాములపర్తి తాజా మాజీ సర్పంచ్ తిరుమలరెడ్డి, మండల్ ప్రెసిడెంట్ తాండ కనకయ్య గౌడ్ పరామర్శించారు. అనంతరం ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల్ యూత్ ప్రెసిడెంట్ , గ్రామ శాఖ అధ్యక్షుడు, నాయకులు పాల్గొనడం జరిగింది.

## అరుణాచలంలో వైభవంగా రథం ట్రయల్ రన్

జయభేరి, చెన్నై :
తమిళనాడు తిరువణ్ణామలై అరుణాచలేశ్వరస్వామి ఆలయ మహారథం ట్రయల్ రన్ వైభవంగా జరిగింది. ఆలయంలో కార్తిక మహాదీపోత్సవాలు డిసెంబరులో జరగనున్నాయి. వేడుకల్లో భాగంగా రథోత్సవం 10న నిర్వహించనున్నారు. అరుణాచలేశ్వర స్వామి, ఉన్నాములై అమ్మవారిని ఊరేగించే మహారథాన్ని రూ.70 లక్షలతో మరమ్మతు చేశారు. ఈ మహారథం ట్రయల్ రన్ శుక్రవారం ప్రారంభమైంది. వేలాది మంది భక్తులు పాల్గొని రథాన్ని లాగారు.

## ఘనంగా ముత్యాలమ్మ తల్లి అమ్మవారి విగ్రహ ప్రతిష్ట

జయభేరి, పరవాడ:
పరవాడ మండలం వాడ చీపురుపల్లి పంచాయతి బురదపేట గ్రామదేవత ముత్యాలమ్మ తల్లి నూతన ఆలయ విగ్రహ ప్రతిష్ట మహోత్సవం కార్యక్రమం ఆదివారం నిర్వహకులు చాలా ఘనంగా నిర్వహించారు. ఉదయం నుండి వేదపండితుల మంత్రాలు మధ్య హోమం కార్యక్రమలతో అమ్మవారి విగ్రహం ప్రతిష్టబడింది.ఈ కార్యక్రమంకి మండల నలుమూలలు నుంచి భక్తులు విచ్చేసి అమ్మవారి ధర్శనం చేసుకొన్నారు.తదనంతరం ఆలయం వద్ద అన్న సమారాధన కార్యక్రమం నిర్వహించారు.
ఈ సందర్భంగా అమ్మవారి ఆలయం నిర్మాణానికి సహకారం అందించిన ప్రతి ఒక్కరికి ప్రత్యక ధన్యవాదములు తెలియజేసారు. ఈ యొక్క కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్ రాజ్, జడ్పీటీసీ పయిల సన్యాసిరాజు, వైస్సార్సీపీ సెంట్రల్ కమిటీ మెంబర్ పయిల శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీ బంధం నాగేశ్వరరావు, మండలంలో నాయుకులు కొన రామారావు, వెన్నల సన్యాసి రావు, గెడ్డం ఉమా, బురద రాజు, తాతాజీ, పెద్దిశెట్టి శేఖర్, గొర్లి గోపి, కృష్ణబాబు, గోవింద్, గొన్న హేమచంద్ నాయుడు, చరణ్ రాజ్, మాసవరపు అప్పల నాయుడు తదితరులు పాల్గొని అమ్మ వారిని దర్శించుకోవడం జరిగింది.





## రైతుల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తుంది

■ ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి

జయభేరి, పరకాల, నవంబర్ 9:
ఆదివారం సంగెం మండలం కాపుల కనపర్తి ఎఫ్ ఎ సి ఎస్ ఆధ్వర్యంలో కాపుల కనపర్తి సొసైటీ యందు వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతుల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని, రైతులు పండించిన వరి ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని, గత ప్రభుత్వం రైతుల సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించిందని అన్నారు. ఏ గ్రేడ్ కు రూ. 2320, కామన్ రకానికి రూ.2300 ధర చెల్లిస్తుందని, రైతులు దళారులను ఆశ్రయించి మోసపోవద్దని సూచించారు. సన్న రకం ధాన్యానికి రూ.500 బోనస్ అందిస్తున్నట్లు ప్రభుత్వం నిర్ణయించిన ప్రకారం 17% మాయుచర్ ఉండాలి అని అన్నారు. నిబంధనల మేరకు తేమ శాతం వచ్చిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేసి మిల్లులకు తరలించాలని, లారీలలో మిల్లులకు తరలించిన ధాన్యాన్ని అన్లోడ్ చేసే దగ్గర జాప్యం జరగకుండా చూడాలనీ సూచించారు. కేవలం ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలలో మాత్రమే సన్నధాన్యానికి బోనస్ లభిస్తుందన్నారు. రైస్ మిల్లులో విక్రయాలకు బోనస్ వర్తించదని ప్రతి ఒక్క రైతుకు ఈ విషయంపై అవగాహన కల్పించాలని సూచించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో మౌలికసదుపాయాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు. రవాణ, హమాలీలు, గోనె సంచుల కొరత రాకుండా చూడాలని అన్నారు.



## సర్వేకు అందరూ సహకరించాలి

■ వై. సుదర్శన్, దేవరకొండ మున్సిపల్ కమిషనర్

జయభేరి, దేవరకొండ :
ఇంటింటి సమగ్ర కుటుంబ సర్వేకు పట్టణ ప్రజలందరూ సహకరించాలని దేవరకొండ మున్సిపల్ కమిషనర్ ఎస్ సుదర్శన్ పేర్కొన్నారు. ఆదివారం కుటుంబ సర్వే లో భాగంగా సిబ్బందితో కలిసి సర్వేను పరిశీలించారు.
అనంతరం వారు మాట్లాడుతూ...సర్వే చేస్తున్న సిబ్బంది ఎలాంటి పొరపాట్లు జరగకుండా ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నామని తెలిపారు. ప్రభుత్వం సదుద్దేశంతో ప్రారంభించిన సర్వేలో జనం భాగస్వాములు కావాలన్నారు.
ఈ సర్వకు సంబంధించి ప్రభుత్వం ప్రజల నుండి ఎలాంటి ఓటిపి చెప్పమని అడగడం, లింకులు పంపడం జరగదని సైబర్ నెరగాల ఉచ్చులో పడకుండా జాగ్రత్తలు వహించాలన్నారు. ఎన్యుమరేటర్లు తమ ఇంటికి వచ్చే లోపు సరైన పత్రాలతో సిద్ధంగా ఉండి, సర్వేకు సహకరించాలని కోరారు.





## అభయాంజనేయ స్వామి విగ్రహం ఏర్పాటు మహాదానందం

■ ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

జయభేరి, కాప్రా :
భక్తుల కోరిన కోరికలు తీర్చే అభయాంజనేయ స్వామి క్షేత్రపాలకుడి విగ్రహాన్ని కుషాయిగూడ గ్రామ నడిబొడ్డులో ఏర్పాటు చేసుకోవడం భక్తకోటికి మహాదానందంగా ఉందని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. కుషాయిగూడ బస్ స్టాండ్ హనుమాన్ వేదిక స్థలంలో హనుమాన్ విగ్రహ నిర్మాణ సమితి బజరంగ్ దళ్ కుషాయిగూడ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన 50 అడుగుల అభయాంజనేయ స్వామి (క్షేత్రపాలకుడు) విగ్రహ శంకుస్థాపన పూజా కార్యక్రమంలో ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏండ్ల కాలం క్రితం కుషాయిగూడ గ్రామంలో మహిమాన్వితుడైన అంజనీ పుత్రుడు అభయాంజనేయ స్వామి దేవాలయం అత్యంత ప్రాశిష్టతను సంతరించుకుందన్నారు. కుషాయిగూడ బస్ స్టాండ్ లో హనుమాన్ భక్తమండలి కుషాయిగూడల భక్తజనులు అభయాంజనేయ స్వామి గద్దెను నిర్మించుకొని అత్యంత నిష్టతో పూజాధి కార్యక్రమాల తో పాటుగా హనుమాన్ జయంతి శోభాయాత్రలను జరుపుకోవడం జరుగుతుందన్నారు. పూజా కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ బొంతు శ్రీదేవి, మాజీ కార్పొరేటర్ సింగిరెడ్డి ధన్పాల్ రెడ్డి, చర్లపల్లి కాలనీల సమాఖ్య సిసిఎస్ ప్రతినిధులు, కుషాయిగూడ గ్రామ పుర ప్రముఖులు, హనుమాన్ విగ్రహ నిర్మాణ సమితి బజరంగ్ దళ్ కుషాయిగూడ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## యువకులకు క్రికెట్ కిట్లు అందించిన మున్సిపల్ చైర్మన్

■ క్రికెట్ కిట్లు అందించిన మాధవరం సందీప్ రావును అభినందించిన రాజేశ్వర్ రావు



జయభేరి, నవంబర్ 10:
మేడ్చల్ జిల్లా తూంకుంట మున్సిపాలిటి పరిధిలోని సింగాయిపల్లిలోని క్రీడాకారులకు మున్సిపల్ చైర్మన్ కారంగుల రాజేశ్వర్ రావు, కౌన్సిలర్ సురేష్ కలిసి క్రికెట్ కిట్లను అందచేసారు. అయితే కూకట్ పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు తనయుడు మాధవరం సందీప్ రావు సహకారంతో ఈ క్రికెట్ కిట్లు అందించినట్లు చైర్మన్ రాజేశ్వర్ రావు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న యువకులు క్రీడల్లో రాణించాలానే ఉద్దేశ్యంతో వారికి సందీప్ రావు సహకారం అందించారనీ చైర్మన్ వెల్లడించారు. గ్రామీణ ప్రాంతాల యువతలో దాగి ఉన్న క్రీడా స్పూర్తిని వెలికితీయాలనే ఉద్దేశ్యంతో సందీప్ రావు యువతకు ఈ క్రికెట్ కిట్లు అందించడం సంతోషకరమన్నారు. వారు ఇలాగే యువతకు ప్రోత్సాహం అందించాలని కోరారు. అదేవిధంగా యువకులు క్రీడల పట్ల ఆసక్తి కనబరుస్తూ తమ నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని వారు సూచించారు.

## వివాహ వేడుకల్లో కాంగ్రెస్ పార్టీ నాయకులు

■ నూతన వధూవరులను ఆశీర్వదించిన పార్టీ నాయకులు అఫ్జల్ ఖాన్, పలువురు నాయకులు



నవంబర్ 10:
మేడ్చల్ జిల్లా పూడూర్ లోని శుభ వేదిక ఫంక్షన్ హాల్ లో శామీర్ పేట్ మండల నాయకులు విలాసాగరం నర్సింహా కూతురు రమ్య వివాహం ఘనంగా జరిగింది. ఈ వివాహ వేడుకకు సీనియర్ ఉద్యమ కారులు, కాంగ్రెస్ నాయకులు మహ్మద్ అఫ్జల్ ఖాన్ హాజరై నూతన వధూవరులు రమ్య, లలిత్ కుమార్ దంపతులను ఆశీర్వదించారు. అదేవిధంగా ఈ వివాహ వేడుకకు కాంగ్రెస్ నాయకులు హాజరై వధూ వరులను ఆశీర్వదించారు.

## కాప్రా డివిజన్ లో పర్యటించిన ఉప్పల్ ఎమ్మెల్యే



జయభేరి, కాప్రా :
కాప్రా డివిజన్ పరిధిలోని సాయి బాబా నగర్ లోని డబుల్ బెడ్ రూం కాలనీలో ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పర్యటించారు. అక్కడ నెలకొన్న సమస్యల గురించి చర్చించడం జరిగింది. ప్రధాన సమస్య నీటి సరఫరాకు పరిష్కారం దిశగా చర్యలు తీసుకుంటామని ఆయన అన్నారు. తన దృష్టికి వచ్చిన సమస్యల పరిష్కారానికి తప్పకుండా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అధికారులతో మాట్లాడి వెంటనే సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో BRS పార్టీ నాయకులు భైరీ నవీన్ గౌడ్, బంక వెంకటేష్, గౌస్, రహీం, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.



# కార్పొరేట్ హాస్పిటల్స్ నందు వైద్య సౌకర్యం కల్పించాలి

- ప్రభుత్వ పెన్షనర్స్,ఉద్యోగులకు హెల్త్ కార్డుపై కార్పొరేట్ హాస్పిటల్స్ నందు ఉచిత వైద్యం అందించాలి

**జయభేరి, దేవరకొండ :**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం దేవరకొండ కార్యవర్గ సమావేశం సేవాసదనం నందు అధ్యక్షులు తాడిశెట్టి నరసింహ అధ్యక్షతన ఈ రోజు జరిగినది. ఈ సందర్భంగా కార్యదర్శి అంకం చంద్రమౌళి మాట్లాడుతూ ప్రభుత్వ పెన్షనర్స్ అందరికి ఒక శాతం పే నుండి తీసుకొని కార్పొరేట్ హాస్పిటల్స్ నందు వైద్య సౌకర్యం కల్పించాలని, మిగిలిన నాలుగు వాయిదాల డి.ర్ మంజూరు చేయాలని, పి.ర్. సి వెంటనే అమలు చేసి బకాయి నగదుగా చెల్లించాలని, మెడికల్ బిల్లులు, పదవీ విరమణ పొందిన ఉద్యోగుల గ్రాడ్యూటీ, కమ్యూటేషన్ వెంటనే చెల్లించాలని కోరినారు. కోశాధికారి పంగునూరు లింగయ్య నెలవారి ఆర్థిక నివేదిక ప్రవేశపెట్టి ఆమోదము పొందినారు. అనంతరం కార్యవర్గం సభ్యులు జంపాల యాదగిరి తన మనమరాలు, మనమడు పుట్టినరోజు సందర్భంగా హాజరైన పెన్షనర్స్ అందరికి భోజనాలు ఏర్పాటు చేసినారు. ఈ కార్యక్రమంలో సహా అధ్యక్షులు గంగిడి దామోదర్ రెడ్డి, జిల్లా కార్యదర్శి కంచర్ల నారాయణ రెడ్డి, ఉపాధ్యక్షురాలు పడమటి శాంతకుమారి, కార్యవర్గం సభ్యులు, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# మున్సిపాలిటీ అభివృద్ధిలో దాతల సహకారం మరువలేనిది



**జయభేరి, ఘట్కేసర్ :**

పోచారం మున్సిపల్ పరిధిలోని అన్నోజిగూడ సూర్య నగర్ కాలనీలో దాతల సహకారంతో నిర్మించిన భూగర్భ డ్రైనేజీ ని ప్రారంభించిన మున్సిపల్ చైర్మన్ బోయపల్లి కొండల్ రెడ్డి. ఆదివారం పోచారం మున్సిపల్ పరిధిలోని అన్నోజి గూడ సూర్య నగర్ కాలనీలో దాదాపు అంచనా వ్యయం 1లక్ష రూపాయల తో 50 మీటర్ల భూగర్భ డ్రైనేజీ నీ నిర్మించారు. కొబ్బరి కాయ కొట్టి ప్రారంభించారు. అనంతరం జ్యూట్ బ్యాగులను కాలనీ వాసులకు పంపిణీ చేశారు. దాతలు నర్సింహులు, ఆనంద్ రెడ్డి సాయి, శ్రీనివాస రావు, యాదగిరి షకీల్, రుక్మ రెడ్డి శాలువతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ మాట్లాడుతూ.. మున్సిపాలిటీ అభివృద్ధిలో దాతల సహకారం మరువలేనిది అని మున్సిపాలిటీ అభివృద్ధిలో మరికొందరు ముందుకు రవాలనీ కోరారు. ఈ కార్యక్రమంలో జయలక్ష్మి రూప మున్సిపల్ సిబ్బంది కాలనీవాసులు పాల్గొన్నారు.

# పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక




**జయభేరి, బాపట్ల :**

ఉదయం అందరూ శ్రీ భవన్నారాయణ స్వామి వారిని దర్శించుకుని 1974 సంవత్సరము పదవ తరగతి చదివిన పూర్వ విద్యార్థుల సమ్మేళనం బాపట్లలో గౌతమ్ గ్రాండ్ హోటల్ లో ఆదివారం నిర్వహించారు. సమావేశానికి పూర్వ విద్యార్థి రోహిణి మహేష్ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా మున్సిపల్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు రాజేశ్వరి పాల్గొని ఆమె మాట్లాడుతూ.. పూర్వ విద్యార్థులకు, ప్రస్తుత విద్యార్థులకుఉన్న తేడాను, తల్లిదండ్రుల బాధ్యత రహిత్యాన్ని గురించి వివరించారు. విశిష్ట అతిథిగా జిల్లా అడిషనల్ ఎస్పీ పాండురంగ విట్టల్ మాట్లాడుతూ.. ఆధ్యాత్మికంగా మానవుడు ఎక్కడి నుంచి ఎక్కడికి వెళ్తాడు వివరనాత్మకంగా వివరిస్తూ పూర్వ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. అనంతరం పూర్వ విద్యార్థులందరూ కలిసి వారి గురువు చలమయ్య మాస్టారును ఘనంగా సత్కరించారు. పూర్వ విద్యార్థులు వారి 50 సంవత్సరాల జ్ఞాపకాలు ఒకరిని ఒకరు పంచుకున్నారు. కార్యక్రమంలో పి డి. శ్రీనివాసరావ, ఆనాటి అటెండర్ చిన్ని బోయిన సుబ్బారావు సన్మానించారు. కార్యక్రమంలో జూలగంటి ప్రసాద్, తిలక్, పాంచ్ జన్య, తిమ్మరాజు సుబ్బారావు, బి. వేణుగోపాల్, ఏక హనుమంత రావు, నాగవరపు నాగేశ్వరరావు, రషీద్, హరి ప్రకాష్, చలమయ్య, రోశయ్య, తదితరులు పాల్గొన్నారు.

# ఒక ప్రైవేటు ట్రస్ట్ పేరుతో ఇబ్బంది

- ఇబ్బంది పడుతున్న పెంటా రెడ్డి కాలనీ వాసులు


**జయభేరి, మేడిపల్లి :**



శ్రీ నిమిషాంబికా మాత ఆలయం భక్తులతో ఇబ్బంది పడుతున్న పెంటా రెడ్డి కాలనీ వాసులు.. బారికేడ్లు, సెక్యూరిటీల నడుమ ఆలయ చుట్టుపక్కల కాలనీలో ప్రజలు బయటికి వెళ్ళామంటే భయపడుతున్న ఆలయ చుట్టుప్రక్కల కాలనీల ప్రాజలు. ఆదివారం ఎక్కడైనా బయటికి వెళ్ధామని ఓలా/ ఉబర్ వెహికల్స్ బుక్ చేసుకుంటే భారీకేడ్లతో వెహికల్స్ ఆపేస్తున్నా ఆలయ సిబ్బంది/సెక్యూరిటీ.. సమస్యను పరిష్కరించాలని స్థానిక కమిషనర్, ట్రాఫిక్ పోలీసులకు సంబంధించిన అధికారులకు పెంటా రెడ్డి కాలనీ వాసులు ఆధ్వర్యంలో వినతిపత్రం ఇచ్చి నెల రోజులు దాటిన ఇంతవరకు ఎలాంటి పరిష్కార మార్గం చూపలేదు.. ఒక ప్రైవేటు ట్రస్ట్ పేరుతో ఇంతమందినీ ఇబ్బంది పెడుతున్న ఆలయ నిర్వాహకులపైన చట్టపరమైన చర్యలు తీసుకోవాలంటు.. వెంటనే తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం, దేవాదాయశాఖ మంత్రి, అధికారులు దేవాలయాన్ని ఎండోమెంట్ ఆధీనంలోకి తీసుకొని విధివిధానాలను చేపట్టాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

# 10వ తరగతి పరీక్ష తేదీలు

**జయభేరి, హైదరాబాద్, నవంబర్ 10:**



పదవ తరగతి పరీక్ష ఫీజు తేదీలను తెలంగాణ ప్రాథమిక విద్యామండలి విడుదల చేసింది. ఈ నెల 18 వరకు ఫీజు చెల్లించేందుకు అవకాశం కల్పించారు. 18వ తేదీ వరకు ఎలాంటి అదనపు రుసుము లేకుండా ఫీజు చెల్లించేందుకు అవకాశం కల్పించారు. రూ.50 ఆలస్య రుసుముతో డిసెంబర్ 2 వరకు, రూ.200 ఆలస్య రుసుముతో డిసెంబర్ 12 వరకు అవకాశం కల్పించారు. అంతే కాకుండా రూ.500 రుసుముతో డిసెంబర్ 21వ తేదీ వరకు అవకాశం కల్పించారు. 21వ తేదీనే చివరి తేదీగా ప్రకటించింది. ఆ తరవాత ఫీజు కట్టేందుకు అవకాశం లేదని స్పష్టం చేశారు. ఫీజుల వివరాల విషయానికి వస్తే... రెగ్యులర్ విద్యార్థులకు అన్ని సబ్జెక్టులకు కలిపి రూ. 125 చెల్లించాల్సి ఉంటుంది. మూడు అంతకంటే ఎక్కువ సబ్జెక్టులకు రూ.110 చెల్లించాలి. మూడు కంటే ఎక్కువ సబ్జెక్టులు ఉన్నా కూడా రూ.125 చెల్లించాలి. అంతేకాకుండా ఒకేషనల్ విద్యార్థులు రూ.125తో పాటు అదనంగా రూ.60 చెల్లించాల్సి ఉంటుంది. 2025 మార్చి నెలలో పరీక్షలు నిర్వహించే అవకాశం ఉంది. ఇదిలా ఉంటే ఇటీవలే తెలంగాణ ఇంటర్ పరీక్ష ఫీజు షెడ్యూల్ సైతం విడుదలైంది. నవంబర్ 6వ తేదీ నుండి పరీక్ష ఫీజు చెల్లించేందుకు అవకాశం కల్పించారు.అదనపు రుసుము లేకుండా నవంబర్ 26వ తేదీ వరకు పరీక్ష ఫీజు చెల్లించేందుకు అవకాశం ఉంది. ఆ తరవాత చెల్లించేవారు అదనపు రుసుము చెల్లించాల్సి ఉంటుంది. ఆ తరవాత చెల్లించే వారు ఫైన్ తో చెల్లించడానికి అవకాశం ఉంది. ఇక అదనపు రుసుము వివరాలు చూస్తే.. రూ.100 నుండి అదనపు రుసుముతో కట్టేందుకు వీలు ఉండగా చివరి తేదీ డిసెంబర్ 27 వరకు అదనపు రుసుము రూ.2000తో కట్టేందుకు అవకాశం ఉంది. ఆ తరవాత ఫీజు కట్టేందుకు అవకాశమే లేదు. కాబట్టి పదోతరగతి, ఇంటర్ విద్యార్థులు గడువు ముగియకముందే ఫీజు చెల్లించాలి.

# చెత్తను తొలగించండి మహాప్రభో..



- కొర్ర కిషన్ నాయక్, సమాచార హక్కు చట్టం రక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షులు

**జయభేరి, డిండి ;**

అధికారుల అలసత్వం,అధికారుల మొండివైఖరితో గ్రామాలలో పారిశుధ్యం పేరుకుపోయిందని సమాచార హక్కు చట్టం రక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షులు కొర్ర కిషన్ నాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిండి మండలం నగర దుబ్బ తండా నుండి కొత్త తండా గ్రామపంచాయతీకి వెళ్లే ప్రధాన రహదారిపై పేరుకుపోయిన చెత్తను, పెంట కుప్పలను తొలగించాలని మండల అధికారులు ఎంపీడీఓ, ఎంపీఓ, మండల ప్రత్యేక అధికారిల దృష్టికి తీసుకెళ్లిన అధికారులు స్పందించడం లేదని పేర్కొన్నారు. గత 20 రోజుల నుండి డ్రైనేజీ కాలువల్లో చెత్తాచెదారం చేరి రోడ్డుపై మురికి నీరంతా వస్తుందని స్థానికులు వాపోతున్నారు. రోడ్డుపై నడవడానికి వీలు లేకుండా పోతుందని తండావాసులు తెలిపారు. విషజ్వరాలు ప్రబలుతుంటే అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ పట్టించుకోవడంలేదని, ఎన్ని సార్లు ఫిర్యాదు చేసిన న్యాయం జరుగలేదని ఆవేదన వ్యక్తం చేశారు.

వృద్ధాలు, చెత్త రోడ్డు పక్కనే పేరుకుపోయిన స్థానికులు, వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని,దోమలు వ్యాప్తి చెందడంతో రోగాల బారిన పడుతున్నామని అని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.




**సిబ్బందితో పూర్తి స్థాయిలో పనులు చేయించే పరిస్థితి అధికారుల్లో కనిపించడంలేదని అని ప్రభుత్వాలు, పాలకులు మారుతున్నా గ్రామాల్లో పరిస్థితి మారడంలేదని, ఆ మేరకు ఎవరూ చర్యలు తీసుకోవడంలేదని అని ఆయన అన్నారు.ఇప్పటికైనా అధికారులు, పాలకులు స్పందించి గ్రామంలో పారిశుధ్యాన్ని మెరుగుపరిచేందుకు చర్యలు తీసుకుని, డ్రైయినేజీ వ్యవస్థ సక్రమంగా ఉండేలా చూసి ప్రజలకు ఇబ్బందులు లేకుండా, రోగాల బారిన పడకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.**

ఏదైనా అంటు వ్యాధి వచ్చినప్పుడు మాత్రమే అధికారులు హడావుడి చేస్తున్నారని, రోడ్లపై చెత్తచెదారం వేసినవారిపై చర్యలు తీసుకోవడంతో పాటు పారిశుధ్యాన్ని మెరుగుపరచాలని అని ఆయన కోరారు. ఆ గ్రామ పంచాయతీ కార్యదర్శి కూడా పట్టించుకోవడంలేదని అని ఆయన విమర్శించారు. రోడ్లపై చెత్త, పెంటకుప్పలను వెంటనే తొలగించలని అపారిశుధ్యంతో పాటు డ్రెయినేజీ వ్యవస్థ కూడా అంతంత మాత్రంగానే ఉన్న వాటిని వెంటనే మెరుగుపరచాలని కోరారు.

# బిజెపి సభ్యత్వ నమోదు

**జయభేరి, సికింద్రాబాద్ :**



సికింద్రాబాద్ కంటోన్మెంట్, భావనకాలనీలో బిజెపి సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొన్న మల్కాజ్గిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్. దేశ సమగ్రత, అభివృద్ధి, ఆత్మగౌరవం ప్రపంచ చిత్రపటం మీద నిలవాలంటే మోడీకి మరింత బలం చేకూర్చాలాన్న సంకల్పం దేశవ్యాప్తంగా చూస్తున్నాం. గతంలో కంటోన్మెంట్లో ఎప్పుడూ కూడా బిజెపి పార్టీ గెలవలేదు. ఎమ్మెల్యే ఎలక్షన్స్ లో తిలక్ కి తక్కువ ఓట్లు వచ్చిన అంతిమంగా ఎంపీ ఎన్నికల్లో మాత్రం ఇక్కడ గెలిచింది భారతీయ జనతా పార్టీ, ఎగిరింది కాషాయ జెండా కాబట్టి మీరంతట మీరే గొప్పగా పని చేసి గెలిపించినందుకు ధన్యవాదాలు తెలియజేస్తున్నాను.
మల్కాజ్గిరి పార్లమెంట్లో మనకి పడ్డ ఓట్లలో 50% మెంబర్షిప్ చేసుకోవాల్సిన అవసరం ఉంది. దానికోసం అందరూ కృషి చేయాలని కోరుతున్నాను. ఎంపీగా మీకు కొత్త కావచ్చు కానీ 25 ఏళ్ల రాజకీయ చరిత్ర మీ కళ్ళముందే ఉంటుంది. నా మీద నమ్మకం విశ్వాసం మీరు వ్యక్తపరిచారు దానికి తగ్గట్టుగా పని విధానం ఉంటుందని హామీ ఇస్తున్నాను. హైడ్రా పేరిట పేదల ఇల్లు కూలగొట్టిన నాడు ఇది క్షేమం కాదు.. ముఖ్యమంత్రి అని చెప్పినం. మూసి ప్రక్షాళనకు మేము వ్యతిరేకం కాదు కానీ మూసిలో పారాల్సింది మురికి నీరు కాదు తాగే నీరు పారాలని మేము కోరుకుంటున్నాము. మూసి ప్రక్షాళనకు ఎప్పుడూ మేము వ్యతిరేకించలేదు కానీ ఇల్లు కూలగొట్టి పెద్దలకు, కార్పొరేట్ కంపెనీలకు ఆ భూములు కట్టబెట్టే ఆలోచనను మేము వ్యతిరేకిస్తున్నాం. ముఖ్యమంత్రి హోదాని మరిచిపోయి ప్రజల మీద దాడి చేసే ప్రయత్నం చేస్తున్నారు అలాంటి విషయాల్లో మాలాంటివారు మీకు అండగా ఉంటామని తెలియజేస్తున్నాను. అధికారం అమ్మ ఇచ్చింది కాదు, కొనుక్కుంటే దొరికేది కాదు ప్రజల ఆశీర్వాదంతో వాళ్ల ఓట్లకు పుట్టిన పదవి, వాళ్ళు ఇచ్చిన అధికారాన్ని పట్టుకొని వాళ్ల మీద దౌర్జన్యం చేస్తానంటే.. చూసి చూసి బండకేసి కొడతారు. కెసిఆర్ ను కొడితే ఏమైపోయారో మీరు చూశారు. వీళ్ళని కొట్టే రోజులు ఎక్కువ దూరం లేదు. నాలుగు సంవత్సరాలు ఉంది ప్రజల కోసం మంచి చేసే ప్రయత్నం చేయి. ఏ కష్టం వచ్చినా మీ వెంట మేముంటాం. ఈ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొన్న ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు.

# జనాభా ప్రతిపాదికన రిజర్వేషన్లు కల్పించాలి

- తెలంగాణలో కులగనన చేయడం హర్షనీయం
- బీసీ రిజర్వేషన్లు పెంచాలని ముఖ్యమంత్రికి విజ్ఞప్తి

**జయభేరి, మేడిపల్లి :**



అంబేద్కర్ ఆశయ సాధన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు,నత్తి మైసయ్య ఆధ్వర్యంలో బాబా సాహెబ్ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి జ్ఞానమాల సమర్పించే కార్యక్రమం 299 ఆదివారాలుగా బోడుప్పల్లో విజయవంతంగా కొనసాగుతుంది. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ ఆశయ సాధన సంఘం సభ్యులు అంబేద్కర్ విగ్రహానికి జ్ఞానమాల సమర్పించి నివాళులర్పించారు.ఈ సందర్భంగా నత్తి మైసయ్య మాట్లాడుతూ జనాభా ప్రతిపాదికన రిజర్వేషన్లు కల్పించకపోవడంతో రాజకీయంగా, సామాజికంగా దళిత బహుజనులు వెనుకబడిపోతున్నారని తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో దేశంలో ఎక్కడా లేనివిధంగా కులగనన చేయడం హర్షనీయమని, రాష్ట్రవ్యాప్తంగా సమగ్ర కుటుంబ సర్వే ప్రారంభించినందుకు ముఖ్యమంత్రి ఏవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతున్నామని అన్నారు. అదేవిధంగా తెలంగాణ రాష్ట్రంలో కులగనన పారదర్శకంగా జరగాలని, రాబోయే స్థానిక ఎన్నికలలో కుల ప్రతిపాదికన రిజర్వేషన్లు అమలుపరచాలని అంబేద్కర్ ఆశయ సాధన సంఘం తరపున ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి విజ్ఞప్తి చేస్తున్నామని నత్తి మైసయ్య అన్నారు.ఈ కార్యక్రమంలో భూ పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు బుగ్గ మైసయ్య, ఏ రాపోలు శ్రీరాపోలు,శ్రీరాముల జ్ఞానేశ్వర్,గరుగుల యాకయ్య,ఏ రాజేష్,త్రినేత్ర తదితరులు పాల్గొన్నారు.



# మీడియా ప్రతినిధులపై దాడులు చేస్తే ఊరుకునేది లేదు

- మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి ఆసుపత్రి యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి
- టియుడబ్లూజే దాడుల నిరోధక కమిటీ రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ సభ్యుడు జెకె హరినాథ్

**జయభేరి, మేడ్చల్ :**

నారాయణ మల్లారెడ్డి ఆసుపత్రిలో న్యూస్ కవరేజ్ చేయడానికి వెళ్లిన విలేఖరిపై సిబ్బంది బౌన్సర్లను పెట్టి దాడి చేయడం అమానుషం. ఈ విషయంపై వెంటనే చర్యలు తీసుకోవాలని దాడుల నిరోధక కమిటీ రాష్ట్ర సభ్యుడు జేకే హరినాథ్ డిమాండ్ చేశారు .ఆస్పత్రిలో సరైన ట్రీట్మెంట్ చేయకుండా ఒక ప్రాణం బలైందంటూ బాధితుల ఫిర్యాదు మేరకు వెళ్లిన టీవీ రిపోర్టర్ పై యాజమాన్యం దాడి చేయించడం అమానుష చర్య అని ఆయన అన్నారు. తూతూ మంత్రంగా కేవలం సిబ్బందిపై కేసులు నమోదు చేస్తే చూస్తూ ఊరుకోబోమన్నారు. నేరుగా యాజమాన్యంపై కేసు నమోదు చేసి కఠిన చర్యలు చేపట్టాలని అన్నారు. ఆస్పత్రి వర్గాలు సామాన్యులపై, రోగుల అటెండర్ లపై దాడులకు దిగడం ఏంటని వైద్యులు ఉండాల్సిన ఆసుపత్రిలో బౌన్సర్లతో పని ఏంటని ప్రశ్నించారు. సామాన్య ప్రజానీకాన్ని భయభ్రాంతులకు గురి చేసేందుకే ఆస్పత్రి ఆవరణలో నిబంధనలకు విరుద్ధంగా బౌసర్లను నియమించుకోవడం దుర్మార్గమన్నారు. మాజీ మంత్రి మల్లారెడ్డి తన పలుకుబడితో ఏం చేసినా నడుస్తుందిలే అనుకుంటే సహించేది లేదని స్పష్టం చేశారు. ఆస్పత్రి యాజమాన్యంపై తగిన చర్యలు చేపట్టకపోతే పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఇటీవల కాలంలో పోలీసులు ఏవో కారణాలు చూపుతూ విలేకరులపై తప్పుడు కేసులు నమోదు చేయడానికి ప్రయత్నిస్తున్నారని ఇలాంటివి చేస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు.

# గంగాధర్ కి అభినందనలు తెలిపిన మాజీ సర్పంచ్ చుక్కా

- రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుడుగా అవార్డు పొందబోతున్న గంగాధర్ మాస్టర్



**జయభేరి, పరవాడ:**

పరవాడ గ్రామానికి చెందిన కోరుపోలు గంగాధర్ మాస్టర్కి రాష్ట్రప్రభుత్వం రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుడుగా ఎంపిక అవ్వడంతో పాటు సోమవారం రాష్ట్ర ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడు చేతుల మీదగా తీసుకోబోతున్న సందర్భంగా గంగాధర్ మాస్టర్కి పరవాడ మాజీ సర్పంచ్ చుక్కా రాము నాయుడు ప్రత్యేక అభినందనలు తెలియజేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుడుగా గంగాధర్ మాస్టర్ అవార్డు అందుకోబోతుండడం అనేది గ్రామం,గ్రామంలో ప్రజలు గర్వించదగ్గ విషయమని నమ్మిన వృత్తిలో ఉన్నతి శిఖరాలు ఎదగడం అందరకి సాధ్యం అయ్యే పని కాదు అని అన్నారు.పరవాడ గ్రామం పేరు రాష్ట్ర స్థాయిలో విద్యాపరంగా పేరుప్రతిష్టలు తీసుకోచ్చునందుకు గంగాధర్ మాస్టర్కి ప్రత్యక ధన్యవాదములు తెలియజేసారు.

jayabheridaily.com




## వారెవ్వా అందాలు..

### గ్లామర్ సొగసులతో మతిపోగొట్టేస్తోన్న హమీదా..

బుల్లితెరపై ఈ అమ్మడు చాలా ఫేమస్. అందం, అభినయంతో రెండు తెలుగు రాష్ట్రాల ఫ్యామిలీ ఆడియన్స్ కు చాలా దగ్గరయ్యింది. బిగ్ బాస్ రియాల్టీ షో.. ఆ తర్వాత బ్రహ్మముడి సీరియల్ తో మరింత పాపులర్ అయ్యింది. తాజాగా ఈ ముద్దుగుమ్మ లేటెస్ట్ ఫోటోషూట్ చూస్తే మతిపోవాల్సిందే. బుల్లితెరపై బిగ్ బాస్ రియాల్టీ షో ద్వారా క్రేజ్ సొంతం చేసుకుంది హమీద. ఈ షోలో అడుగుపెట్టకముందు ఈ అమ్మడు గురించి అసలు జనాలకు అంతగా తెలియదు. కానీ ఈ షోలో ఆట తీరుతో ఫేమస్ అయ్యింది. ఆ తర్వాత బ్రహ్మముడు సీరియల్ ద్వారా తెలుగు ప్రేక్షకులకు మరింత దగ్గరయ్యింది. ఇందులో స్వప్న పాత్రలో నటించి మెప్పించింది. మొదట్లో ఇందులో నెగిటివ్ షేడ్స్ ఉన్న పాత్రలో కనిపించింది. కానీ తర్వాత ఆమె పాత్రను పాజిటివ్ గా మార్చారు. అయితే పాజిటివ్ గా మారిన తర్వాత హమీదాకు తెలుగులో మంచి ఫాలోయింగ్ ఏర్పడింది. అయితే ఉన్నట్లుండి ఆ సీరియల్ నుంచి తప్పుకుంది హమీద. అందుకు కారణాలు మాత్రం తెలియలేదు. ప్రస్తుతం నెట్టింట క్రేజీ ఫోటోషూట్లతో రచ్చ చేస్తుంది. అటు ట్రెడిషనల్.. ఇటు మోడ్రన్ డ్రెస్సులతో రచ్చ చేస్తుంది. ఈ అమ్మాడి లేటెస్ట్ ఫోజులు చూసి ఆశ్చర్యపోతున్నారు నెటిజన్స్. తాజాగా మెహందీ కలర్ డ్రెస్ లో మెరిసిపోయింది. మెహందీ కలర్ లెహంగాలో అచ్చం యువరాణిలా ముస్తాబయ్యింది హమీద. ఈ ముద్దుగుమ్మ లేటేస్ట్ ఫోటోషూట్ నెట్టింట తెగ వైరలవుతుండగా.. ఈ బ్యూటీ ఫోటోలకు భిన్నంగా రియాక్ట్ అవుతున్నారు ఫ్యాన్స్.





## అంత కాన్ఫిడెంట్ ఏంటి అమ్మడు..

ఇన్నేళ్లూ ఒక లెక్క.. ఇప్పుడో లెక్క అని అంటున్నారు నటి అనుష్క శెట్టి. ఈ ఏడాది పుట్టినరోజు గతంలా ఉండదని ఒకింత గట్టిగానే ఫ్యాన్స్ కి హామీ ఇస్తున్నారు. ఇంతకీ అనుష్క ఈ బర్త్ డేకి ఏం ప్లాన్ చేశారు? ఎలాంటి గిఫ్టులు రెడీ చేస్తున్నారు. తెలుగు స్క్రీన్ మీద ఏ హీరోయిన్‌ని మీరు ఎక్కువగా మిస్ అవుతున్నారు అని నెటిజన్లను అడిగితే యునానిమస్‌గా వినిపించే పేరు అనుష్క. బాహుబలి తర్వాత ప్యాన్ ఇండియా రేంజ్‌లో అనుష్క రూలింగ్ ఉంటుందని అందరూ అనుకున్నారు. కానీ జరిగింది మాత్రం ఇంకోలా. అయితేనేం.. రీసెంట్‌గా మిస్ శెట్టి మిస్టర్ పొలిశెట్టితో లక్కీ లేడీ అనిపించుకున్నారు స్వీటీ. ఈ ఏడాది ఆమె పుట్టినరోజుకు ఘాటీ నుంచి మాంచి గిఫ్ట్ రెడీ అవుతోంది. ఆంధ్రా ఒరిస్సా బార్డర్‌లో జరిగే కథగా ఘాటీని తెరకెక్కిస్తున్నట్టు ఇప్పటికే హింట్ ఇచ్చేశారు కెప్టెన్ క్రిష్. ఘాటీతో పాటు కథనార్ నుంచి కూడా అప్‌డేట్స్ ఎక్స్‌పెక్ట్ చేస్తున్నారు అభిమానులు. వీటితో పాటు మరో రెండు సినిమాల అనౌన్స్‌మెంట్లు కూడా ఉంటాయన్నది ఫ్యాన్స్ కి ఖుషీ ఖబర్.



## ఆశ్చర్యపోయేలా అఖండ ఎంట్రీ

'అఖండ' సీక్వెల్‌గా 'అఖండ - తాండవం' ప్రకటించినప్పట్నుంచీ సినిమాపై అంచనాలు ఆకాశాన్నంటేశాయ్. బాలయ్య ప్రస్తుతం బాబీ సినిమాను పూర్తి చేసే పనిలో బిజీగా ఉన్నారు. మరోవైపు బోయపాటి శ్రీను 'అఖండ' సీక్వెల్ పనుల్లో నిమగ్నమైపోయారు. ఇప్పటికే ఈ సినిమాకు సంబంధించిన పూజాకార్యక్రమాలు కూడా జరిగాయి. ప్రస్తుతం బోయపాటి నటీనటుల ఎంపికపై దృష్టిసారించారు. మరోవైపు లొకేషన్స్ సెర్చింగ్ కూడా జరుగుతున్నది. సీక్వెల్‌లో కూడా ప్రీ ఇంటర్వెల్‌లోనే 'అఖండ' ఎంట్రీ ఉంటుందట. ఆ సీన్‌కోసం ఓ లొకేషన్‌ని సెలక్ట్ చేసి, అక్కడే భారీ సెట్ నిర్మిస్తారని ఇన్‌సైడ్ టాక్. 14రీల్స్ ప్లస్ పతాకంపై రామ్ ఆచంట, గోపీ ఆచంట, నిర్మిస్తున్న ఈ చిత్రానికి థమన్ సంగీతం అందిస్తున్నారు. బోయపాటి, బాలకృష్ణ కాంబినేషన్‌లో ఇప్పటికే హ్యాట్రిక్ విజయాలు నమోదయ్యాయి. డబుల్ హ్యాట్రిక్‌కి శ్రీకారం చుట్టే దిశగా బోయపాటి అడుగులేస్తున్నట్టు చిత్ర బృందం చెబుతున్నది.

## ఆవేశపడుతున్న రవితేజ?



ఫహాద్ ఫాజిల్ 'ఆవేశం' సినిమా మలయాళంలో భారీ విజయాన్ని నమోదు చేసిన విషయం తెలిసిందే. కేరళలో వందకోట్ల వసూళ్లను రాబట్టిందా సినిమా. ఆ సినిమాను తెలుగులో పునర్నిర్మించాలనే ప్రయత్నాలు జరుగుతున్నాయి. అప్పట్లో బాలకృష్ణ ఈ సినిమా చేస్తున్నారంటూ వార్తలు కూడా వచ్చాయి. తాజా సమాచారం ప్రకారం ఈ సినిమా రీమేక్ రైట్స్‌ని హీరో రవితేజ సొంతం చేసుకున్నారట. మరి ఆయనే చేయడానికి తీసుకున్నారా? లేక కేవలం నిర్మాతగానే వ్యవహరిస్తారా? అనేది తెలియాల్సివుంది. నిజానికి 'ఆవేశం' కథ రవితేజ శారీరకభాషకు సరిగ్గా సరిపోతుంది. ఆయన చేస్తేనే ఆ పాత్రకు న్యాయం జరుగుతుందని పలువురు అభిప్రాయపడుతున్నారు. ప్రస్తుతం రవితేజ 'మాస్ జాతర' అనే సినిమా చేస్తున్నారు. ఈ సినిమా వచ్చే ఏడాది మార్చిలో విడుదల కానుంది.

Printed and Published & Owned by MOTHE RAGHU THIRUPATHI REDDY, Printed at DOLPHIN GRAPHICS, #24-88/1, L.N. Colony, IDA Uppal, Hyderabad, Medchal-Malkajgiri, telangana-500039.
Published at # 2-20-2/71/C, Ganesh Nagar, Uppal, Hydrebad, Medchal-Malkajgiri-500039. Editor: M. R. Thirupathi Reddy. Cell: 9391 544 889 RNI No: TELTEL12264. email: jayabherinews@gmail.com, www.jayabheridaily.com